

అధికారుల తీరుపై ఆగ్రహం

తిరుపతి రూరల్ మండలంలో కబ్జాలు, ఇసుక దందాలను అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్‌లు నిలదీశారు. - 8లో



దోపిడీ కేసులో ఆరుగురి అరెస్ట్

కరకంబాడి సమీపంలోని మల్లిమడుగు వద్ద ఓ వ్యక్తిని దోచుకున్న కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



పకడ్బందీగా ఓటరు జాబితా

ఓటరు ఫొటో స్పష్టంగా కనిపించేలా పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలని జేసీ శుభం బన్సల్ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

'ఎట్ హోమ్ ఆహ్వానం'.. వర్సిటీకి దక్కిన గౌరవం



మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : స్వాతంత్ర్య వేడుకల్లో భాగం భారత రాష్ట్రపతి కార్యాలయంలో నిర్వహించే ఎట్ హోమ్ కార్యాక్రమానికి ఆహ్వానం అందడం జాతీయ సంస్కృత వర్సిటీకి దగ్గిన గౌరవంగా భావిస్తున్నామని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1961లో ప్రారంభమైన విద్యాపీఠం 2020కి జాతీయ విశ్వవిద్యాలయంగా ఎదిగిందన్నారు. నాణ్యమైన బోధన, పరిశోధనలలో అగ్రగామిగా నిలిచి నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందని వెల్లడించారు. సంస్కృత భాషను విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా వర్సిటీ పనిచేస్తోందన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్‌లు రజనీకాంత్ శుక్లా, విష్ణుభట్టాచార్యులు, కృష్ణేశ్వర్ జా, ప్రొఫెసర్ వి.రమేష్‌బాబు, ఏపీఆర్‌ఓలు డాక్టర్ కె.కుమార్, బుల్లీదాస్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 70,728 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,611 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.468 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది.

త్వరలో మరో పీజీ కోర్సుకు మంగళం.!

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ఇప్పటికే పలు కోర్సులను నిలిపేశారని, ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ కోర్సుకు సైతం త్వరలో మంగళం పాడబోతున్నట్లు సంకేతాలు ఇస్తున్నారని పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు వారు మాట్లాడుతూ 1998లో ఈ కోర్సు ప్రవేశపెట్టారని, ద్ద సంఖ్యలో విద్యార్థులు అడ్మిషన్లు పొందారని వెల్లడించారు. కోర్సు పూర్తి చేసుకున్నవారు ఇస్రో, డీఆర్‌డీఓ, బీఏఆర్‌సీ, రైల్వే, టెలీకమ్యూనికేషన్స్ సంస్థలలో ఇంజనీర్లుగా సేవలందిస్తున్నారని వివరించారు. అలాంటి కోర్సును మరింత ప్రోత్సాహించాల్సి అధికారులు అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ ఆపివేస్తున్నామని ఎందుకు అడ్మిట్ అవుతున్నారంటూ ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. యథావిధిగా కోర్సును కౌన్సెలింగ్‌లో ఉంచేందుకు వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజ్ఞానం..వికాసం

సంస్కృతం.. ప్రపంచంలోని సకల భాషలకు మూలం. పురాణేతిహాసాలకు కేంద్రం. దేవభాషగా విరాజిల్లిన అద్భుతం.. భరతభూమి నుంచి మానవాళికి అందిన అపూర్వ బహుమానం. ఆధ్యాత్మిక వైభవానికి నిలువెత్తు నిదర్శనం. అంతటి పురాతన భాషామృతం పరిరక్షణకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశేషంగా కృషి చేస్తోంది. మహోన్నత సంస్కృతి పూర్వవైభవం సంతరించుకునేందుకు చిత్తశుద్ధితో చర్యలు చేపడుతోంది. బాల్యం నుంచే విద్యార్థులకు సంస్కృతంపై ఆసక్తిని పెంపొందించేందుకు అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ అందిస్తోంది. శ్లోకాలు..గేయాలు.. బాల సాహిత్యంలో పిల్లలను ఉద్ధండులుగా తీర్చిదిద్దుతోంది.



జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం



పిల్లలకు శ్లోకాలు నేర్పుతున్న అధ్యాపకులు

- ఏటా వెయ్యిమందికి పైగా శిక్షణపొందుతున్న బాలబాలికలు
- పిల్లలను ఆకట్టుకునేలా బోధన పద్ధతులు
- ఎన్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో సంస్కృత భాషా సంవర్ధన కేంద్రాలు
- ఏడేళ్లుగా కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
- త్వరలో అందుబాటులోకి మరో 100 సెంటర్లు

తిరుపతి సిటీ : సంస్కృత భాషాభివృద్ధే లక్ష్యంగా తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే 2017లో బాలబాలికల కోసం సంస్కృత భాషా సంవర్ధన కేంద్రం (బాల సంస్కృత వికాస కేంద్రం) ఏర్పాటు చేసింది. సంస్కృత భాషపై బాల్యం నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలనే సదుద్దేశంలో కృషి చేస్తోంది. 3 ఏళ్ల నుంచి 16 ఏళ్ల పిల్లలకు ఉచిత శిక్షణ అందిస్తోంది. తొలి ఏడాది 10 మందితో ప్రారంభమైన బాల వికాస కేంద్రం అంచెలంచెలుగా ఎదిగింది. ప్రస్తుతం సుమారు వెయ్యి మందికి పైగా పిల్లలకు శిక్షణ ఇచ్చే స్థాయికి చేరుకుంది. ఈ మేరకు వర్సిటీలో మూడు సెంటర్లతో పాటు తిరుచానూరు అక్కారంపల్లె గోకులం వద్ద, పాత మెటర్నటీ ఆస్పత్రి సమీపంలో బాల సంస్కృత కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో ప్రస్తుతం సుమారు 200 నుంచి 250 మంది వరకు శిక్షణ పొందుతున్నారు. అలాగే తిరుపతి నగరంలో మరో 70 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

పాఠశాలలు, అపార్ట్‌మెంట్లలో సైతం..

సంస్కృత భాష నేర్చుకోవాలనే తపన, పిల్లలకు నేర్పించాలనే ఆసక్తి ఉన్న విద్యాసంస్థలు, దేవస్థానాలు, మందిరాలు, అపార్టుమెంట్‌లో నివసిస్తున్న వారు వర్సిటీలోని అధికారులను సంప్రదించవచ్చు. కనీసం 30మంది పిల్లలు ఉంటే వారు నివసిస్తున్న ప్రాంతాలకే అధ్యాపకులు వెళ్లి ఉచిత శిక్షణను అందిస్తారు. జిల్లాలోని ఏ ప్రాంతం వారైన నిర్దేశించిన విద్యార్థుల సంఖ్య ఉంటే అధ్యాపకులను పంపేందుకు వర్సిటీ అధికారులు సిద్ధంగా ఉన్నారు.

తల్లిదండ్రులకు అవగాహన

బాలకేంద్రంలో తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులకు సైతం భారత సంస్కృతిపై అవగాహన కల్పించేందుకు ఇతిహాసాలు, నిత్య ప్రార్థనా గీతాలపై ఉచితంగా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రవేశం పొందిన తమ పిల్లలను బాల వికాస కేంద్రానికి తీసుకువచ్చి రెండు గంటల పాటు వర్సిటీ ఆవరణలో తల్లిదండ్రులు నిరీక్షణ చేస్తుంటారు. ఆ సమయంలో వారికి వర్సిటీ అధికారులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు సంబంధించిన శ్లోకాలు నేర్పిస్తున్నారు.

అడ్మిషన్ ఇలా..

ప్రతి శని, ఆదివారాల్లో సాయంత్రం 5గంటలకు సంస్కృత వర్సిటీలోని చెలికాని అన్నారావు భవనంలో ఏర్పాటు చేసి బాల సంస్కృత వికాస కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులు సంప్రదించవచ్చు. 3 నుంచి 16 ఏళ్ల బాలబాలికలు ఈ కేంద్రంలో అడ్మిషన్లు పొందే అవకాశం ఉంది. ఆసక్తిగల ప్రతి విద్యార్థికీ ప్రవేశం కల్పిస్తున్నారు. ఈ మేరకు విద్యార్థి ఆధార్ కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డు, ఫొటో, తల్లిదండ్రుల ఫోన్ నంబర్‌ను అందించాల్సి ఉంటుంది. ప్రతి శని, ఆదివారాలలో సాయంత్రం 5గంటల నుంచి 7వరకు తరగతులు ఉంటాయి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తారు.

ఆకట్టుకునేలా శిక్షణ



డిజిటల్ బోర్డు వద్ద బాలబాలికలు



భక్తి శ్రద్ధలతో శ్లోకాలను ఆలపిస్తున్న బాలబాలికలు

బాల వికాస కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎల్ సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందిన అధ్యాపకులు, పీజీ, పీహెచ్‌డీ పరిశోధకలు, వలంటీర్లు అందించే బోధనా పద్ధతులు పిల్లలను ఆకట్టుకుంటున్నాయి. ఆటపాటలతో సంస్కృత శ్లోకాలు, బాల సాహిత్యం, నిత్య ప్రార్థనా శ్లోకాలు, గీతాలు, పద్యాలు, భక్తి గేయాలు, పదాల ఉచ్చారణ, భాషా వ్యాకరణం, సంబోధన వంటి వాటిపై శిక్షణనిస్తున్నారు. ప్రధానంగా డిజిటల్ స్క్రీన్‌పై యానిమేషన్ స్టోరీలను ప్రదర్శిస్తూ సంస్కృత భాషపై అవగాహన కల్పిస్తున్నారు.

భాషాభివృద్ధే లక్ష్యం



జాతీయ విశ్వవిద్యాలయంగా సంస్కృత విద్యాపీఠం గుర్తింపు పొందిన నాటి నుంచి భాషాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోంది. వర్సిటీకి నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించింది. బాల్యం నుంచే సంస్కృతంపై పిల్లలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. అందులో భాగంగా బాలల కోసం సంస్కృత భాషా సంవర్ధన కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ నిస్తున్నాం. తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన వస్తోంది. ఈ ఏడాది మరో 100 కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వీసీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం

శ్లోకాలతో స్వరపేటిక ధృడం



బాల వికాస కేంద్రంలో సంస్కృత శ్లోకాలు, క్లిష్ట తరమైన పద్యాలు చాలా సులువుగా నేర్పుతున్నారు. దీంతో బాల్యంలోనే పిల్లలకు స్వరపేటిక ధృడంగా తయారవుతుంది. మా పాప పేరు శ్రీనేత్ర గత ఏడాది నుంచి తరగతులకు హాజరవుతోంది. పదాలను క్లారిటీగా పలుకుతోంది. శ్లోకాలు, పద్యాలు, నిత్య ప్రార్థనా గీతాలు ఎంతో ఉత్సాహంగా నేర్చుకుంటోంది. ఇలాంటి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసిన యూనివర్సిటీ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– హేమావతి, విద్యార్థిని తల్లి, ప్రభుత్వ టీచర్

సంతోషంగా ఉంది



మా పిల్లలు శివ పార్వతి, మన స్వితను బాల వికాస కేంద్రంలో చేర్పిచాం. పిల్లలకు సంస్కృత భాష, ప్రార్థనా గీతాలు నేర్పించాలనే ఆసక్తితో ఇక్కడ అడ్మిషన్ తీసుకున్నాం. బోధనా పద్ధతులు పిల్లలను ఆకర్షిస్తున్నాయి. క్రమం తప్పకుండా తరగతులకు వస్తున్నారు. రెండు గంటల పాటు ఆటపాటలతో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. మా పిల్లలు క్లిష్టమైన పదాలను సైతం అలవోకగా పలుకుతుంటే సంతోషంగా ఉంది.

– హరీష, విద్యార్థినుల తల్లి, ఇర్లానగర్, తిరుపతి

సంస్కృతమంటే మక్కువతో..



మా పాప పేరు వెన్నెల. సంస్కృతంపై మక్కువతో ఈ ఏడాది బాల కేంద్రంలో చేర్పించా. డిజిటల్, యానిమేషన్ పద్ధతులలో బోధిస్తున్నారు. పిల్లలు ఆసక్తితో సాహిత్యం నేర్చుకుంటున్నారు. సంస్కృతంపై పట్టు జ్ఞానానికి మూలంగా చెప్పవచ్చు. భాష నేర్చుకుంటే ఆత్మస్థైర్యం పెరుగుతుంది. పిల్లలకు మంచి వాగ్ధాటి వస్తుంది.

– మహేష్, విద్యార్థిని తండ్రి, ప్రైవేట్ ఉద్యోగి

బోధన భేష్



మా పిల్లలు మోజిత్, శ్రేష్టకు ఇక్కడ శిక్షణ ఇప్పిస్తున్నాం. సంస్కృత పదాలను, భక్తి శ్లోకాలను ఎంతో శ్రద్ధగా పిల్లలు నేర్చుకుంటున్నారు. తరగతులకు వెళదామంటూ మమ్మల్ని ఒత్తిడి చేస్తున్నాంటేనే అర్థం చేసుకోవచ్చు. బాల వికాస కేంద్రంలో బోధన భేషుగ్గా ఉంది. డిజిటల్ బోధనతో పాటు ఆటపాటలు పిల్లలను ఆలోచింపజేస్తున్నాయి. ప్రతి విద్యార్థి సంస్కృతం నేర్చుకోవడం ఉత్తమం.

– లావణ్య, విద్యార్థుల తల్లి, గృహిణి

భగవంతుని స్మరించినట్లే..



మాపాప పేరు హరిణి. బాల కేంద్రంలో చేర్పించా. ఇక్కడ చేరిన బాలబాలికలు ఎంతో ఆసక్తితో తరగతులకు హాజరవుతున్నారు. వారు ఆలపించే ప్రార్థనా శ్లోకాలు వింటుంటే భగంతుని స్మరించినట్లే ఉంటుంది. ఇటువంటి ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిన వర్సిటీ అధికారులకు రుణపడి ఉంటాం. సంస్కృతం అంటే అభిమానంతో క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతున్నాం.

– రామాచార్యులు, విద్యార్థిని తండ్రి

రూ.5 కోట్లు కట్టు.. ఇసుక కొల్లగొట్టు!

ప్రకృతి వనరులను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు కాసులకు కక్కుర్తిపడుతున్నారు. ముఖ్యంగా ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. అడిగినంత చెల్లిస్తే వెంటనే తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని కూటమి నేతలకు బంపర్ ఆఫర్ అందించారు. రూ.5కోట్లు కట్టేస్తే ఇష్టారాజ్యంగా ఇసుక కొల్లగొట్టుకోవచ్చని నిస్సిగ్గుగా ప్రకటించేశారు. ఈ మేరకు ముడుపులు అందుకుని అనధికార రీచ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు సహకరిస్తున్నారు. సదరు ఎమ్మెల్యే దందా తెలుసుకున్న ఇతర శాసనసభ్యులు సైతం ఇదే బాటలో నడిచేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇసుకాసురులతో కలిసి సై'ఖతం' చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

- ఇసుకాసురులకు ఓ ఎమ్మెల్యే బంపర్ ఆఫర్
- అడిగినంత చెల్లిస్తే అనుమతులు
- ఊరూరా కూటమి నేతల అక్రమ ఇసుక రీచ్‌లు
- భారీ యంత్రాలతో విచ్చలవిడిగా తవ్వకాలు



పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నాలుగు రోజులుగా నిలిచి ఉన్న వాహనాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అక్రమంగా ఇసుకను తవ్వి తరలించుకునేందుకు జిల్లాలోని ఓ ఎమ్మెల్యే బంపర్ ఆఫర్ ప్రకటించారు. నెలకు రూ.5 కోట్లు చెల్లించిన వారికి నియోజకవర్గంలో ఎక్కడైనా తవ్వుకుని విక్రయించి సొమ్ముచేసుకునేందుకు అనధికారికంగా అనుమతులు ఇస్తున్నారు. ఒక ఎమ్మెల్యే చేపట్టిన దందా గురించి తెలుసుకున్న మిగిలిన శాసనసభ్యులు సైతం అదే దారిలో నడుస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక అని ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గత నెల 8వ తేదీన తిరుపతి జిల్లాలో వెంకటగిరి మండలం మొగళ్లగుంట, దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు, నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ, పిచ్చాటూరు మండలం అడవికోడియంబేడు, చిత్తూరు జిల్లాలో గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలి, చిత్తూరు రూరల్ మండలం దిగువమాసపల్లె, పాలూరులో అధికారిక ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసింది. వీటిలో కేవలం మూడు రీచ్‌లలో మాత్రమే ఇసుక లభ్యమవుతోంది. మిగిలిన నాలుగు రీచ్‌లు ఇసుక నిల్వలు లేక వెలవెలబోతున్నాయి.

అధికారులతో కుమ్మక్కై..!

ఇసుక అక్రమ రవాణా ద్వారా భారీగా డబ్బులు సంపాదించుకునేందుకు కూటమి నేతలు పథకం వేశారు. ముందుగా సంబంధిత అధికారులతో కుమ్మక్కైయ్యారు. అధికారిక రీచ్‌లలో ఇసుకను డంప్ చేయకుండా ఆపేయాలని లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలోనే సుమారు 15 రోజులుగా రీచ్‌లలో ఇసుక డంప్ చేయటం మానేశారు. ఇసుక అక్రమ రవాణాలో ఆరితేరిన ఓ బీజేపీ నేత, టీటీడీ బోర్డు మాజీ సభ్యుని కుమారుడు తొలుత టీడీపీ ఎమ్మెల్యేలను కలిశాడు. ఇసుక తవ్వుకుంటామని, ఎంతో కొంత సమర్పించుకుంటానని చెప్పుకున్నాడు. తిరుపతి జిల్లా పరిధిలో విస్తారంగా ఇసుక లభ్యమయ్యే ప్రాంతానికి చెందిన ఓ ఎమ్మెల్యే వెంటనే సహకరిస్తానని భరోసా ఇచ్చారు. ప్రతి నెలా రూ.5 కోట్లు చెల్లిస్తే నియోజక వర్గంలో ఎక్కడైనా, ఎంతైనా తవ్వకుని అమ్ముకోవచ్చని చెప్పారు. ఎమ్మెల్యే ఆఫర్‌కి ఇసుకాసురుడు వెంటనే ఓకే చెప్పాడు.

తప్పని పడిగాపులు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారిక ఇసుక రీచ్‌లు అక్రమాలకు నిలయంగా మారిపోయాయి. టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన అనధికార రీచ్‌లలో ఇసుకను అమ్ముకునేందుకు ప్రభుత్వ రీచ్‌లను పావుగా వాడుకుంటున్నారు. రెవెన్యూ అధికారులను మామూళ్ల మత్తులో ముంచి ఇసుక లోడ్ చేయకుండా చూసుకుంటున్నారు. ఈ క్రమంలో పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడులోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నాలుగు రోజులుగా సుమారు 400 పైగా టిప్పర్లు, ట్రాక్టర్లు బారులు తీరి ఉన్నాయి. టిప్పర్‌కు అదనంగా రూ.2వేల లెక్కన అధికారులు వసూలు చేశారు. అయినప్పటికీ టీడీపీ నేతల నుంచి అనుమతులు రాకపోవడంతో వాహనాలకు ఇసుక లోడ్ చేయలేదు. దీంతో వాహనాల యజమానులు, డ్రైవర్లు తిండీ తిప్పలు కూడా లేకుండా నాలుగు రోజులగా రీచ్ వద్దే పడిగాపులు కాస్తున్నారు.

ట్రాక్టర్లను పట్టేసి.. టిప్పర్లను వదిలేసి!




శ్రీకాళహస్తి సెబ్ కార్యాలయం వద్ద ఇసుక ట్రాక్టర్లు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రెవెన్యూ, పోలీస్, సెబ్ అధికారులు సామాన్యులపై తమ ప్రతాపం చూపిస్తున్నారు. కూటమి నేతల అక్రమాలపై కన్నెత్తి చూసేందుకు కూడా సాహసించడం లేదు. మంగళవారం జరిగిన ఓ ఘటనే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. శ్రీకాళహస్తి మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.5వేల చొప్పున జరిమానా విధించి విడుదల చేశారు. అయితే తొట్టంబేడు మండలం విరూపాక్షపురం, పెన్నలపాడులో కొందరు టీడీపీ నేతలు జేసీబీల ద్వారా టిప్పర్లకు ఇసుక లోడ్ చేసి తరలిస్తుంటే మాత్రం అధికారులు పట్టించుకోవడంలేదు. ఇక్కడ తవ్విన ఇసుకను వేర్వేరు ప్రాంతాల్లో డంప్ చేసి, రాత్రి వేళల్లో లారీల్లో నింపి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. దీనిపై మాత్రం అధికారులు స్పందించడంలేదు. స్వర్ణముఖి నదిలో ట్రాక్టర్ ఇసుక కావాలంటే టీడీపీ నేతలు రూ.1,100 వసూలు చేస్తున్నారు. దీనిపై తొట్టంబేడు తహసీల్దార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం విశేషం.

వెలసిన అనధికార రీచ్‌లు

ఎమ్మెల్యే అనుమతి ఇవ్వడంతో సదరు నియోజకవర్గంలో ఇసుకాసురుడు అనధికారికంగా సుమారు 100 రీచ్‌లు ఏర్పాటు చేశాడు. భారీ యంత్రాలతో ఇసుక తవ్వేసి ప్రతి రోజూ వందల వాహనాల ద్వారా తరలించి సొమ్ముచేసుకుంటున్నాడు. కంటైనర్ల ద్వారా కూడా చెన్నై, బెంగుళూరుకు సైతం తరలించి జేబులు నింపుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మిగిలిన ఎమ్మెల్యేల్లో కొందరు అదే తరహాలో బేరం పెట్టారు. ఇప్పటికి నాలుగు నియోజక వర్గాల్లో మాత్రం బేరం కుదురడంతో అక్రమ రీచ్‌లు వెలిశాయి. గంటకు మూడు కంటైనర్లు, ఆరు టిప్పర్ల చొప్పున ఇసుక తరలింపు సాగుతోంది. మొత్తం వ్యవహారంలో సంబంధిత అధికారులకు వాటాలు వెళుతున్నాయని, అందుకే మీడియాలో కథనాలు వస్తున్నా స్పందించడం లేదని తెలుస్తోంది.

గంగమ్మ సంబరం



రేణిగుంటలో గంగజాతర వేడుకగా నిర్వహిస్తున్నారు. మంగళవారం పెద్దసంఖ్యలో భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. – రేణిగుంట



ఘనంగా 'తిరంగా'



తిరపతిలోని మహతి ఆడిటోరియం నుంచి తారకరామా స్టేడియం వరకు మంగళవారం హర్ ఘర్ కా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ, కార్పొరేషన్ కమిషనర్ పాల్గొన్నారు. – తిరుపతి క్రైమ్





బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.72,630
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,558

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.83,000
రిటైల్ వెండి గ్రాము	రూ.85.00

క్లుప్తంగా

అసంబద్ధ నిర్ణయాలపై ఉద్యమం తప్పదు

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రభుత్వం తీసుకునే అసంబద్ధ నిర్ణయాలపై ఉద్యమం తప్పదని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఫోర్టో) ఉమ్మడి చిత్తూరు జిల్లా చైర్మన్ దొడ్డా ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి పిల్లపాళెం మునిరత్నం హెచ్చరించారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ సర్దుబాట్లుకు శాస్త్రీయత లేదని, జీఓ 117ను రద్దు చేశాకే ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. 15వేలకు పైగా ఉపాధ్యాయులను సర్‌ప్లస్‌గా చూపించడం విద్యాశాఖ డొల్లతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మెరుగైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఈఈ బాలాజీ

తిరుపతి రూరల్ : విద్యుత్ అక్రమ వినియోగంపై ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మంగళవారం వరదయ్యపాళెం సెక్షన్ పరిధిలోని సంతవేలూరు, అంబూరు, వరదయ్యపాళెంలో ఈఈ పుల్లా బాలాజీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇళ్లు, దుకాణాల యజమానులపై మొత్తం 84 కేసులు నమోదు దాడుల్లో అధికారులు పూర్ణచంద్రకుమార్, నరసింహమూర్తి, మాధవరావు, నరేంద్ర, హరినాథ్, చలపతి, కృష్ణయ్య పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం



అధికారులను ప్రశ్నిస్తున్న పాడిపేట సర్పంచ్ ధనమునిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ వేముల యశోద

- ఎక్కడ చూసినా కబ్జాలు.. ఇసుక దందాలు
- తిరుపతి రూరల్ మండల మీట్‌లో ప్రజాప్రతినిధుల మండిపాటు

తిరుపతి రూరల్ : మండలంలో ఎక్కడ చూసినా కబ్జాలు.. ఇసుక దందాలు.. రౌడీల అరాచకాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేముల యశోద అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసుల పనితీరుపై మండిపడ్డారు. ప్రజాప్రతినిధుల మాటల్లోనే..

- ధనమునిరెడ్డి, సర్పంచ్, పాడిపేట : పాడిపేట పంచాయతీలో రోజూ సుమారు 100 ట్రాక్టర్లతో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. పట్టా భూమి యజమాని శంకర్‌రెడ్డి తన బిడ్డ ఆరోగ్యం సరిగా లేకుంటే చూసేందుకు అమెరికా వెళ్లారు. ఆయన భూమిలో అక్రమంగా ఇసుక తవ్వేసి అమ్మేస్తున్నారు. కొందరు రౌడీ షీటర్ల సాయంతో ఇష్టారాజ్యంగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.
- దామినేటి కేశవులు, సర్పంచ్, పేరూరు : పేరూరు పంచాయతీలో కొందరు టీడీపీ నేతలు కాలువను ఆక్రమించి షెడ్లు నిర్మించారు. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. చివరకు పోలీసులు, వీఆర్‌ఓ వచ్చి అడ్డుకున్నా.. ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడు కూడా నిర్మాణాలు సాగుతున్నాయి. కాలువలు, చెరువుల కబ్జాలను అడ్డుకోకుంటే భవిష్యత్ అంధకారంగా మారుతుంది. వీటిపై స్పందించిన తహసీల్దార్ రేఖ మాట్లాడుతూ ఆక్రమణలు తొలగిస్తామని, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు.
- మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, పేరూరు : తిరుపతి రూరల్ మండలానికి టీఎంసీ తెలుగు గంగ నీరు విడుదలకు గతంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతీసుకుని జీవో జారీ చేయించారు. ఆ నీరు పేరూరుకు చేరేలా అధికారులు ప్రయత్నించాలి. దీంతో సుమారు 20 గ్రామాలతోపాటు తిరుపతి నగరానికి కూడా తాగునీటి ఎద్దడి తప్పుతుంది. అలాగే మంగళం, సప్తగిరి కాలనీ ఎంపీటీసీ సభ్యులు లక్ష్మి, లక్ష్మయ్య మాట్లాడుతూ ఉమ్మడి శెట్టిపల్లె వాసులకు స్థానికంగా ఇంటి పట్టాలు ఇప్పించాలని కోరారు.
- డీవీ రమణ, సర్పంచ్, సాయినగర్ : ఎమ్మెల్యే పులివర్తి నాని పేరు చెప్పి కొందరు పంచాయతీ కార్యాలయాల్లో చొరబడుతున్నారు. తాము చెప్పిందే చేయాలని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించాలని చూస్తే సహించే ప్రసక్తే లేదు. ఈ క్రమంలోనే వీవీ నగర్, పద్మావతిపురం పంచాయతీలకు వరద ముప్పు తప్పించాలని, ఆ మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ యశోద ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రత్నమ్మ పాల్గొన్నారు.

జూనియర్ జడ్జీల బదిలీ

- కొత్త జడ్జీలకు పోస్టింగ్‌లు



అదనపు జూనియర్ జడ్జిగా ఎంపికైన తిరుపతి న్యాయవాది

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, శ్రీకాళహస్తి జూనియర్ జడ్జీలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. అలాగే ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ జడ్జీలుగా ఎంపికైన 20 మందికి విధులు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. శ్రీకాళహస్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న జీ.ధర్మారావును విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా హైకోర్టు బదిలీ చేసింది. అలాగే చిత్తూరు మొబైల్ కోర్టు జడ్జిగా విధులు నిర్వహిస్తున్న కీర్తనను మదనపల్లి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేసింది. జడ్జి కీర్తన ఈనెల 12వ తేదీ నుంచి అక్టోబర్ 20 వరకు జ్యూడీషియల్ అకాడమీలో శిక్షణ ముగిసిన తర్వాత బాధ్యతలు చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. అదేవిధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు న్యాయవాదులు జూనియర్ జడ్జీలుగా ఎంపికయ్యారు. వారిలో తిరుపతి, అవిలాలకు చెందిన మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె పాగు శ్రీనాథ్ కుమారుడు పల్లెపాగు ప్రశాంత్‌కు గుంటూరు జిల్లా మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు, శ్రీనగర్ కాలనీకి చెందిన ఎం.రోహిత్‌ను విశాఖపట్నం జిల్లా, నర్సీపట్నం అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా హైకోర్టు నియమించింది. అలాగే విజయనగరం జిల్లా, దాసన్నపేట, శ్రీ జగన్నాథ నగర్‌కు చెందిన కే కృష్ణవంశీని పుంగనూరు జూనియర్ సివిల్ జడ్జిగా, విజయవాడ రూరల్, ఎంకిపాడు, చంద్రబోస్ కాలనీకి చెందిన పీ.వరుణ్ తేజ్ ను కుప్పం అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమించింది. జూనియర్ జడ్జీలు ఈనెల 31వ తేదీ లోపు ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని హైకోర్టు ఉత్తర్వుల పేర్కొంది. నూతనంగా జూనియర్ జడ్జిలుగా ఎంపికైన వారు మెడికల్ ఆఫీసర్ల వద్ద ఫిట్ నెస్ సర్టిఫికెట్లను పొంది బాధ్యతలు స్వీకరించేటప్పుడు అధికారులకు అందజేయాలని హైకోర్టు సూచించింది.

నగలు తాకట్టు.. బ్యాంకు ఉద్యోగి కనికట్టు!

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గం, వరదయ్యపాళెం స్టేట్ బ్యాంక్ హెడ్‌క్లర్క్ చేతివాటం ప్రదర్శించాడు. బ్యాంకుకు వచ్చిన తాకట్టు బంగారు నగలను తన వ్యక్తిగత అవసరాల కోసం ప్రైవేటుగా కుదువ పెట్టాడు. ఇటీవల బ్యాంకులో నిర్వహించిన ఆడిట్‌లో విషయం బయటకు పొక్కింది. వివరాలు.. హెడ్‌క్లర్క్ వెంకటేష్ బ్యాంకులో గోల్డ్ లోన్లు ఇచ్చే విభాగంలో పనిచేసేవాడు. అందులో తాకట్టుకు వచ్చిన కొన్ని ఆభరణాలను ఎవరికీ తెలియకుండా బయటకు తీసుకెళ్లి సుమారు రూ. 15లక్షల వరకు ప్రైవేటుగా కుదువ దుకాణాల్లో కుదవపెట్టి రుణాలు పొందాడు. ఈ గోల్‌మాల్ వ్యవహారం ఆడిట్‌లో బయటపడింది. దీంతో ఈ వ్యవహారం రీజనల్ ఆఫీస్‌కు చేరింది. దీంతో రెండు వారాలుగా బ్యాంకులో తాకట్టుకు వచ్చిన బంగారు నగల వివరాలు, ప్రతి లోన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి సమాచారం తెలుసుకోవడంలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. అసలు విషయం బయటకు పొక్కడంతో బ్యాంకులో నగలు తాకట్టు పెట్టిన ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

ముగ్గురిపై వేటు

వరదయ్యపాళెం స్టేట్ బ్యాంకులో హెడ్ క్లర్క్ చేసిన నగల గోల్‌మాల్ వ్యవహారం ఆయనతోపాటు, అకౌంటెంట్ ప్రతాప్, బీఎం సుబ్బారావుకు సైతం చుట్టుకుంది. ముగ్గురినీ సస్పెండ్ చేస్తున్నట్లు రీజనల్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు సమాచారం. ఈక్రమంలో మంగళవారం నూతన బీఎంగా అనుదీప్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. నగల గోల్‌మాల్‌లో ముగ్గురు అధికారులపై వేటు పడింది వాస్తవమే అన్నారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు సాగుతున్నందున గోల్డ్ లోన్లు, క్రాప్ రుణాలు ఇవ్వలేకపోతున్నామని, వచ్చే సోమవారం నుంచి అన్ని రుణాలు పొందవచ్చని తెలిపారు. ఖాతాదారులు సంయమనం పాటించాలని కోరారు.

నిజాలు తొక్కిపెట్టి.. సరస్వతీ నిలయాలపై కక్షగట్టి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ నసీంఅలీ

వాకాడు: కూటమి నేతలు నిజాలు తొక్కిపెట్టేస్తున్నారు. పేద పిల్లలు చదువుకునే సరస్వతీ నిలయాలపై కక్ష గడుతున్నారు. ఇలాంటి ఘటనే వాకాడు మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాలలో 15 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు ఆనుకుని కూటమి నేత అనుచరుడి ఇల్లు ఉంది. అతను పాఠశాల స్థలాన్ని దాదాపు 2 అడుగులు ఆక్రమించాడు. తన ఇంటి వైపుగా ఉన్న పాఠశాల కిటికీ బండలు సగానికిపైగా పగులగొట్టేశాడు. అలాగే స్కూల్ మీద పడిన వర్షపు నీరు తన స్థలంలో పడకుండా పాఠశాల స్లాబుపై అక్రమంగా గోడ కట్టాడు. అలాగే తన ఇంట్లో నుంచి పాఠశాల భవనానికి వాష్ బేసిన్ సింక్‌లు అమర్చాడు. దీనిపై ఉపాధ్యాయులు ప్రశ్నించినందుకు కూటమి నాయకులు కక్ష గట్టారు. హాజరు పట్టికలో పిల్లల సంఖ్య ఎక్కువగా చూపి అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేగాక తమ అనుకూల మీడియాలో ప్రచురించి రచ్చరచ్చ చేశారు. పిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గ్రామ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మంగళవారం ఎంఈఓ నసీంఅలీ పాఠశాల రికార్డులను పరిశీలించారు. హాజరు పట్టికలో 15 మంది పిల్లలు ఉండగా 13 మంది బడిలో ఉన్నారని, ఇద్దరు మాత్రమే రాలేదన్నారు. పాఠశాల స్థల ఆక్రమణ విషయమై ఎంపీడీఓ చూసుకుంటరని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్‌కు తగిలిన విద్యుత్ తీగలు

– క్లీనర్‌కు గాయాలు

రేణిగుంట : తూకివాకం పంచాయతీలోని ఓ ప్రైవేటు స్కూల్ సమీపంలో ఉన్న స్వర్ణముఖి నది నుంచి సోమవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తిరుపతి తనపల్లెకు చెందిన ఓ టీడీపీ నాయకుడు రేణిగుంట మండలం తూకివాకం- విప్పమానుపట్టెడ మార్గంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నదిలో ఇసుకను ట్రాక్టర్‌కు లోడ్ చేశారు. వర్షానికి ట్రాక్టర్ దిగబడి అక్కడ నుంచి ముందుకు కదలకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ చాలా సేపు గట్టుకు చేర్చేందుకు ప్రయత్నించాడు. ట్రాక్టర్ చక్రాలు మరింత కూరుకుపోవడంతో ఇక చేసేది లేక ఇసుకను కింద పోసేందుకు ట్రాక్టర్ ట్రక్కును పైకి లేపాడు. పైన వేలాడుతున్న విద్యుత్ తీగలకు ట్రాక్టర్ ట్రక్కు తగలడంతో డ్రైవర్ లక్ష్మయ్య ఓ వైపు, క్లీనర్ మహేంద్ర(25) కిందకు దూకారు. డ్రైవర్ ఇసుక మీద పడటంతో ప్రమాదం తప్పింది. క్లీనర్ పడిన ప్రాంతంలో వర్షపునీరు ఉండడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో చికిత్స నిమిత్తం రేణిగుంట సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గాజులమండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

తిరుపతి అర్బన్ : ఓటర్ల ఫొటోలు స్పష్టంగా కనిపించేలా పకడ్బందీగా జాబితా రూపొందించాలని జేసీ శుభం బన్సల్ ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ పెంచలకిషోర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన మొదలెట్టాలని చెప్పారు. ఫొటో ఓటర్ల జాబితా కోసం ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు షెడ్యూల్ మేరకు పారదర్శకమైన పర్యవేక్షణ చేపట్టాలని వెల్లడించారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మహిళా వర్సిటీ విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

తిరుపతి సిటీ: విశాఖపట్నం, నంద్యాలలో సెప్టెంబర్ 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్, సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థినులు ఎంపికైనట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ ప్రొఫెసర్ సారా సరోజినీ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ జూనియర్ విభాగంలో హర్షిత, మేఘన, సీనియర్ విభాగంలో రమ్య, మౌనిక, గౌతమి, పల్లవి ఎంపికైనట్లు వెల్లడించారు. పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

దోపిడీ కేసులో ఆరుగురి అరెస్ట్

రేణిగుంట : కరకంబాడి సమీపంలోని మల్లిమడుగు రిజర్వాయర్ వద్ద ఓ యువకుడిని బెదిరించి ఓ మొబైల్ ఫోను, రూ.34వేలు నగదు దోచుకున్న కేసులో ఆరుగురు మైనర్లను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు. మంగళవారం రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 8వ తేదీన కట్టబత్తిన రమేష్ అనే యువకుడికి సోషల్‌మీడియాలో పరిచయమైన నాయుడుపేట అమర గార్డెన్స్‌కు చెందిన మైనర్ (19) పార్టీ చేసుకుందామని నమ్మించి మల్లిమడుగు రిజర్వాయర్ వద్దకు తీసుకెళ్లాడు. తర్వాత తనతో వచ్చిన నాయుడుపేటకు చెందిన ఆరుగురు స్నేహితులతో కలసి రమేష్‌ను కొట్టి ఫోన్, నగదు దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రేణిగుంట ఎయిర్‌పోర్ట్ కూడలి వద్ద నిందితులను అరెస్ట్ చేశారు. రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోను, రూ.34వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించినఅర్బన్ సీఐ శరత్‌చంద్ర, ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అవయవదానంతో పునర్జన్మ

చంద్రగిరి : అవయవ దానంతో మరొకరికి పునర్జన్మను ప్రసాదించినవారమవుతామని మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) వీసీ నాగరాజ రామారావు తెలిపారు. మంగళవారం అవయవ దాన దినోత్సవం సందర్భంగా వర్సిటీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ...వ్యక్తి మరణించినా కొన్ని గంటల పాటు అవయవాలు సజీవంగా ఉంటాయన్నారు. వాటిని ఇతరులకు ఉపయోగిస్తే మరొకరి జీవితానికి ఉపయోగపడతాయని వెల్లడించారు. కళ్లు, గుండె, కిడ్నీలు మనిషికి చాలా ముఖ్యమైనవని, వీటిని మరణానంతరం ఇతరులకు కూడా ఉపయోగించవచ్చని వివరించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సారథి, డీన్ జగదీశన్, పారా మెడికల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న వీసీ నాగరాజ రామారావు

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గూడూరురూరల్ : పట్టణంలోని మసీదు వీధిలో శనివారం జరిగిన హత్య కేసులో నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వీవీ రమణకుమార్ తెలిపారు. వివరాలు.. బనిగేసాహేబ్ పేటకు చెందిన అల్లాబక్షు, సోనియా దంపతుల మనస్పర్థలతో విడిపోయారు. ఈ క్రమంలో శనివారం సోనియా, ఆమె సోదరులు జకీర్, షాకీర్‌పై అల్లాబక్షు, అతడి తల్లి షర్మిల, తండ్రి చాన్‌బాషా దాడి చేశారు. ఈ దాడిలో జకీర్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను తిప్పవరప్పాడు క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ శేఖర్ బాబు, ఎస్‌ఐ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనాస్థలంలో మోహన్‌కృష్ణ మృతదేహం (ఇన్‌సెట్) మోహన్‌కృష్ణ (ఫైల్)

రేణిగుంట : కరకంబాడి పంచాయతీ చైతన్యపురం ఎదురుగా రేణిగుంట- కడప మార్గంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రేణిగుంట సీఐ శరత్‌చంద్ర కథనం మేరకు... మండలంలోని చెంగారెడ్డి పల్లెకు చెందిన నర్రా చెంచుమోహన్ కృష్ణ(37) ద్విచక్రవాహనంలో రైల్వేకోడూరుకు వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రేణిగుంట పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

29న పాఠశాలలకు క్రీడా ప్రతిభ అవార్డులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన పాఠశాలలకు అవార్డులను అందజేయనున్నట్లు డీఈఓ శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచేలా క్రీడాకారులను తీర్చిదిద్దిన పాఠశాలలను ప్రోత్సహించేందుకు జిల్లాలోని 5పాఠశాలలను ఎంపిక చేసి ఈ అవార్డులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు తమ క్రీడాకారుల సర్టిఫికెట్లను వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరించి, ఈ నెల 16వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి అవమానం



డిప్యూటీ సీఎం సభలో వేదిక ఎదుట ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంగళవారం శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి చేదు అనుభవం ఎదురైంది. కనీసం ఆమెను వేదికపై ఆహ్వానించకపోవడంతో సూళ్లూరుపేట టీడీపీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరకు పవన్ తన ప్రసంగంలో సైతం ఆమె పేరు ప్రసావించకపోవడంపై మండిపడుతున్నారు. కూటమిలో ప్రధాన పార్టీ అయిన టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధిని కార్యక్రమానికి పిలిచి మరీ అవమానించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

వేతనాలు ఇస్తేనే విధులు

– ఆందోళనకు దిగిన విద్యుత్ బస్సుల డ్రైవర్లు

తిరుపతి అర్బన్ : ప్రతి నెలా వేతనాలు చెల్లిస్తేనే విధులకు హాజరవుతామని విద్యుత్ బస్సుల డ్రైవర్లు స్పష్టం చేశారు. మంగళవారం ఈ మేరకు అలిపిరి డిపో వద్ద బస్సులు ఆపేసి ఆందోళనకు దిగారు. జూలై జీతాన్ని ఇప్పటి వరకు చెల్లించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే అరకొర జీతాలను కూడా సక్రమంగా ఇవ్వకపోతే కుటుంబ పోషణ ఎలా అని వాపోయారు. దీనిపై స్పందించిన బస్సుల నిర్వహణ సంస్థ ప్రతినిధులు రెండు మూడు రోజుల్లో జీతాలు ఇస్తామని బుజ్జగించడంతో ఆందోళన విరమించారు. ఈ విషయమై డీఎం హరిబాబును వివరణ కోరగా జూలై జీతాలు ఇవ్వలేదని విద్యుత్ బస్సు డ్రైవర్లు సర్వీసులను కొంత సమయం నిలుపుదల చేసింది వాస్తవమేనని చెప్పారు. ఈ క్రమంలో విద్యుత్ బస్సుల నిర్వహణ సంస్థ వారికి నచ్చజెప్పడంతో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులు యథావిధిగా కొనసాగుతున్నాయని వివరించారు. మళ్లీ అలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు చేపడుతామని వెల్లడించారు.

జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తిరుపతి క్రైమ్: జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు చట్టవిరుద్ధ కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, పార్సిల్ ఆఫీసుల వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఏదైనా సమాచారం ఉంటే పోలీస్ వారికి గానీ లేదా డయల్ 100 కి సమాచారం అందించాలని సూచించారు.

భక్తుల సంఖ్య మేరకు బస్సులు



ఈఓకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : తిరమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని టీటీడీ ఈఓ శ్యామలరావు కోరారు. మంగళవారం ఈ మేరకు టీటీడీ పరిపాలన భవనంలో జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డితో ఆయన చర్చించారు. కండిషన్‌లోని సర్వీసులను ఎంపిక చేసి బ్రహ్మోత్సవాలకు వినియోగించాలని ఆదేశించారు. కొండకు వచ్చే ప్రతి భక్తుడూ ప్రశాంతంగా తిరుమలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రణాళికాబద్ధంగా ఉత్సవాలకు సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ఆర్టీసీ సిబ్బంది కృషి చేయాలని వివరించారు.